నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శనివారం 2 నవంబర్ 2024
YADADRI BHUVANAGIRI

## ఐరాస అసెంబ్లీ సమావేశాలకు కోడూరువాసి


బ్రహ్మాచారి

సూర్యాపేట టౌన్, నవంబర్ 1 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం అర్వపల్లి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన మారోజు బ్రహ్మాచారికి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ లీగల్ సెల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయనకు ఐక్య రాజ్య సమితి నుంచి ఆహ్వానం అందింది. స్విట్జర్లాండ్ జెనివాలోని ప్రధాన కార్యాలయంలో నవంబర్ 4న జరుగనున్న ఐరాస అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు పిలుపు వచ్చింది. సునామీ అవగాహన దినోత్సవ కార్యక్రమంలో బ్రహ్మాచారి వివిధ దేశాల ప్రతినిధులతో కలిసి బ్రహ్మాచారి పాల్గొననున్నారు. కాగా, తెలంగాణకు ఆయన ఒక్కరికే అవకాశం వచ్చింది.


కొండ కింద వ్రత మండపంలో జర్మన్ షెడ్డు నిర్మాణం

# పత్తి రైతు చిత్తు

## జిల్లాలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

కాంగ్రెస్ సర్కారు తీరుతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో కనీస మద్దతు ధర లభించక నష్టపోతున్నారు. విధిలేని పరిస్థితిలో ప్రైవేట్‌లో దళారులకు చెప్పిన రేటుకు అమ్ముకుని డీలా పడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి వెళ్లక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)

- ప్రైవేట్‌లో అమ్ముకుంటున్న అన్నదాత
- ప్రభుత్వ మద్దతు ధరను కోల్పోతున్న కర్షకులు
- క్వింటా రూ.5,300కి మాత్రమే కొంటున్న దళారులు
- ప్రభుత్వ తీరుతో క్వింటాకు రూ.2వేల వరకూ నష్టం
- పెట్టుబడి కూడా రాక గోస తీస్తున్న రైతాంగం


భువనగిరిలోని ఓ మిల్లులో పత్తి

వానకాలం సీజన్‌కు సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో పంటలు సాగు అయ్యాయని అధికారులు గుర్తించారు. 1.35లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేసినా, 1,00,514 ఎకరాల్లో మాత్రమే రైతులు వేశారు. సకాలంలో వానలు కురువడంతో పాటు పత్తి చేతికొచ్చే సమయంలో వానలు పడడంతో దిగుబడిపై ప్రభావం పడింది. దాంతో మొత్తంగా 5.50 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### ఇంకా కొనుగోళ్లు లేవు

జిల్లాలో ఏటా 12 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సకాలంలో పత్తిని కొనుగోలు చేసేవారు. ఈసారి ఆలేరులో 2, చౌటుప్పల్‌లో 2, మోత్కూర్‌లో 6, వలిగొండలో 2 కేంద్రాలను ఇటీవల ప్రారంభించారు. డిమాండ్ ఉన్న భువనగిరి మండలంలో మాత్రం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. సెంటర్లు మొదలు పెట్టినా చోట అసలు పత్తి కొనుగోళ్ల ఊసే లేదు. ఎక్కడా చిన్న పింజ కూడా కొనలేదు. వర్షాలు కురుస్తుండడంతో పత్తి తడిస్తే తేమ పేరిట నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సీసీఐ కేంద్రాల ఏర్పాటు, కొనుగోళ్లలో తీవ్ర ఆలస్యమైందని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

### దళారులు సిండికేట్

జిల్లాలో పత్తి తీయడం జోరందుకున్నది. సెప్టెంబర్ నుంచే ప్రారంభం కావడంతో ఇప్పటికే ఒక దఫా పత్తి పూర్తి కాగా, రెండోసారి కూడా పత్తి ఏరుతున్నారు. కాగా, సీసీఐ కేంద్రాల్లో కొనకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది. ఇప్పుడు కేంద్రాలు లేకపోవడంతో రైతులు పత్తిని ఇంట్లో నిల్వ పెట్టుకునే సామర్థ్యం లేక దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిస్తే ఏరిన పత్తి దెబ్బతినే ప్రమాదం ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌లో విక్రయిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న దళారులు సిండికెట్‌గా మారి కొర్రీలు పెడుతూ తక్కువ ధరకు పత్తిని కొంటున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 7,521 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బయట దళారులు మాత్రం రూ.5,300 నుంచి రూ.6వేలలోపే ధరపెడుతున్నారు. కొన్నిచోట్ల అందులోనూ కోతలు పెడుతున్నారు. ఈ లెక్కన ఒక్కో క్వింటాకు రైతులు రూ.1,500 నుంచి రూ.2వేలు నష్టపోతున్నారు. దళారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు కుమ్మక్కై దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొనుగోళ్లపై పటిష్ట నిఘా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

### పెట్టుబడి కూడా వస్తలే..

రాష్ట్ర ప్రభుత్వం తీరుతో పత్తి రైతులు దివాలా తీసే పరిస్థితి దాపురించింది. లాభం దేవుడెరుగు.. పెట్టుబడి కూడా రావడం లేదు. ఎకరా పత్తి పండించడానికి సుమారు 30 వేల నుంచి 35వేల వరకు పెట్టుబడి పెట్టారు. పత్తి తీతలకు మరో రూ.15 వేల వరకు ఖర్చు అవుతున్నది. మొత్తంగా రూ.45 వేలు వ్యయం. ఎకరానికి సగటున 8క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. బయట ప్రైవేట్‌లో దళారులు రూ.5,300కి కొన్నా 42,400 మాత్రమే రైతు చేతికి అందుతుంది. అలా చూసిన రూ.2,500 వరకు నష్టమే. రైతు కష్టం ఇందుకు అదనం. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.

### పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి



జిల్లాలో 12 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెబుతున్నా ఎక్కడా పత్తిని కొనే వారు లేరు. ఒక్కొక్క రైతు ఎకరానికి 40 నుంచి 45 వేల రూపాయలు పెట్టుబడి పెట్టారు. ప్రకృతి వైపరీత్యాలకు అడ్డుగా నిలిచి చేతికొచ్చిన పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు లేక అప్పులు ఎక్కువై దళారులను ఆశ్రయిస్తున్నారు. చాలామందికి పెట్టిన పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితులు లేవు. జిల్లా వ్యాప్తంగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి. పత్తి మిల్లుల యజమానుల ఆగడాలను అరికట్టాలి. లేకుంటే పత్తి రైతులను సమీకరించి మిల్లుల ఎదుట ఆందోళనలు చేస్తాం

-కొండమడుగు నర్సింహ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

### ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాలు లేక దళారులు దోసుకుంటుర్రు



ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులు అగ్గువకు పత్తి అడుగుతూ రైతులను దోసుకుంటున్నరు. నేను ఆరెకరాల్లో పత్తి వేసిన. నెల రోజుల నుంచి పత్తి ఏరుతున్నం. ఏరిన పత్తిని అమ్మకానికి తీసుకుపోతే సేటేమో నాణ్యంగా లేదు.. రంగు లేదు.. ఆకు ఉంది అంటూ ఏవేవో సాకులు జెప్పి 4వేల నుంచి 4,500 రూపాయల మించి ధర పెట్టడం లేదు. అమ్మకుండా తిరిగి తీసుకొద్దామంటే ట్రాక్టర్ కిరాయిలు, తొక్కిన కూళ్లు మీద పడుతాయనే భయంతో గత్యంతరం లేక అదే రేటుకు అమ్మకోవాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

- ఈరపాక సుధాకర్, పత్తి రైతు, కంచనపల్లి గ్రామం

## కార్తిక మాసోత్సవాలకు ముస్తాబు

- యాదగిరిగుట్టలో సత్యనారాయణ వ్రతాలకు అన్ని ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, నవంబర్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రాన్ని కార్తిక మాసానికి అధికారులు ముస్తాబు చేశారు. కొండపైన పర్వతవర్ధనీ సమేతరామలింగేశ్వరాలయం, ఉత్తర రాజగోపురం ఎదురుగా, విష్ణుపుష్కరిణి, లక్ష్మీ పుష్కరిణి, సత్యనారాయణస్వామి వ్రత మండపం, స్వామివారి వైకుంఠ ద్వారంతోపాటు పాతగుట్ట ఆలయం వద్ద దీపారాధనకు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు దీపారాధన చేపట్టనున్నారు. తెలంగాణ అన్నవరంగా పేరుపొందిన యాదగిరిగుట్ట క్షేత్రంలో కార్తిక మాసంలో పెద్ద ఎత్తున వ్రతాలు జరుగుతుంటాయి. రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండ కింద వ్రత మండపంలో 6 బ్యాచ్‌లు వ్రతాలు నిర్వహించుకునేలా షెడ్యూల్ రూపొందించారు. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వ్రతాలు కొనసాగనున్నాయి. మొత్తం రెండు హాళ్లలో ఒక్కో బ్యాచ్‌కు 250 మంది చొప్పున 500 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొనే విధంగా వ్రత పీటలను సిద్ధం చేశారు. రూ.800 రుసుముతో వ్రతానికి కావాల్సిన సామగ్రిని ఆలయ అధికారులే సమకూరుస్తున్నారు. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. వ్రత మండపం ముందుబాగంలో స్వాగత తోరణం, భక్తులకు సేద తీరేందుకు ప్రత్యేకంగా జర్మన్ షెడ్డును ఏర్పాటు చేశారు. వ్రత మండపం ప్రదేశంలో స్వామివారి ప్రసాద విక్రయశాలను ఏర్పాటు చేశారు. చుట్టూ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఉంచనున్నారు. దివ్యాంగుల కోసం ట్రై సైకిల్, వాలెట్ పార్కింగ్‌ను అందుబాటులోకి తీసుకురాన్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

**6 బ్యాచ్‌ల్లో వ్రతాలు..**

| | |
|---|---|
| మొదటి బ్యాచ్ | ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు |
| 2వ బ్యాచ్ | 9గంటల నుంచి 10 గంటల వరకు |
| 3వ బ్యాచ్ | 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు |
| 4వ బ్యాచ్ | ఒంటి గంట నుంచి 2గంటల వరకు |
| 5వ బ్యాచ్ | 3 గంటల నుంచి 4గంటల వరకు |
| 6వ బ్యాచ్ | 5గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు |

కార్తిక శుద్ధ పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15న తేదీన 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు చేపట్టనున్నారు.


ఆలేరు సీహెచ్‌సీలో పేషంట్లతో మాట్లాడుతున్న యాదాద్రి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ హనుమంతరావు
- దవాఖానలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- ఒకరి సస్పెన్షన్.. పలువురికి షోకాజ్‌లు

ఆలేరు టౌన్/గుండాల, నవంబర్1 : విధుల్లో చేరిన నాలుగో రోజే జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు అధికార యంత్రాంగంలో హడల్ పుట్టించారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి డ్యూటీలో నిర్లక్ష్యం ఉన్న అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్, ప్రభుత్వ హెల్త్ సెంటర్, సీహెచ్‌సీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీ ఓపీ విభాగంలో ఒక్కరే రాత్రి డ్యూటీ చేసిన డాక్టర్ ఒక్కరే ఉండగా, విధుల్లో ఉండాల్సిన మరో ముగ్గురు వైద్యులు లేకపోవడంతో సూపరిండెంట్ డాక్టర్ స్వప్నారాథోడ్ తోపాటు డాక్టర్లు శ్రీధర్, స్వప్న, రజనికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందుల సరఫరాపై ఆరా తీశారు. అధికారులు, ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గుండాల మండల కేంద్రంలో పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో నిర్లక్ష్యంగా వ్యహరించిన పీఏసీఎస్ సీఈవో యేలే నాగయ్యను సస్పెండ్ చేశారు. ఏఈఓ క్రాంతి కుమార్‌కు షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. గుండలా పీహెచ్‌సీలో 15 రోజుల నుంచి విధులకు హాజరుకాని సీహెచ్‌ఓ వెంకటేశం, పీహెచ్‌ఎన్ వనజ, హెల్త్ సూపర్ వైజర్ కరుణకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

### ఏడుగురు అంగన్‌వాడీలకు షోకాజ్‌లు

యాదగిరిగుట్ట : సమగ్ర కుల గణన సర్వేలో అలసత్వం వహించిన అంగన్‌వాడీ టీచర్లకు కలెక్టర్ హనుంతరావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని యాదగిరిగుట్ట మండలంలో సమగ్ర కుల గణన సర్వేలో పాల్గొనని యాదగిరిగుట్ట–1 అంగన్‌వాడీ టీచర్ కే శోభరాణి, అనురాధ(యాదగిరిగుట్ట–2), బండ మీన(కొత్తగుండ్లపల్లి–1), ఎన్.రమణ(కొత్త గుండ్లపల్లి–2), ఎండీ అక్తర్ సుల్తాన్(పాతగుండ్ల పల్లి–2), పి.సుజాత(ప్రశాంత్‌నగర్–2), వి.రమాదేవి(యాదగిరిపల్లి–1)పై చర్యలకు ఉపక్రమించారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

## స్వర్ణగిరి క్షేత్రం అత్యద్భుతం

- మంత్రి శ్రీధర్‌బాబు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 1 : స్వర్ణగిరి క్షేత్రం ఎంతో అద్భుతంగా నిర్మాణం చేపట్టారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని స్వర్ణగిరి దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంఆ ఆయన మాట్లాడుతూ ఇంతటి మహాద్భుత క్షేత్రాన్ని నిర్మించడం ఎంతో గొప్ప విషయమన్నారు. స్వర్ణగిరి దేవాలయం తెలంగాణ తిరుపతిగా బాసిల్లుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు మంత్రి ని సత్కరించి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేశ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరి నర్సింహ, నాయకులు కరీం, సుధాకర్, నర్సింహ యాదవ్, వెంకటేశ్, దర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## సదర్ సంబురం

ఎన్‌జీ కాలేజ్ మైదానంలో దున్నపోతుల విన్యాసాలు

రామగిరి, నవంబర్ 1 : దీపావళి పండుగను పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో గురువారం రాత్రి యాదవులు సదర్ సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరై యాదవ ప్రముఖులతో కలిసి శ్రీకృష్ణుడికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి రప్పించిన దున్నపోతులను అలంకరించి ఎన్‌జీ కాలేజీ మైదానానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు అబ్బురపర్చాయి. సదర్ సంబురాన్ని చూసేందుకు జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత యాదవ సభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తరాల పరమేశ్‌యాదవ్, యాదవ ప్రముఖులు పిల్లి రామరాజు, అల్లి సుభాశ్, లొడంగి గోవర్ధన్, మామిడి పద్మ, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


నల్లగొండ ఎన్‌జీ కాలేజ్ గ్రౌండ్‌లో దున్నపోతుల విన్యాసాలు

## మూసీలో ఇద్దరు బాలురు మృతి

- వలిగొండలో పండగ పూట విషాదం


కళ్లెం కిరణ్ (ఫైల్)


కళ్లెం జీవన్ (ఫైల్)

వలిగొండ, నవంబర్ 1 : పండుగ పూట సరదాగా చేపల వేటకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మూసీ నదిలో పడి మృతిచెందారు. ఈ విషాధ ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జంగాల కాలనీకి చెందిన అన్నదమ్ముల పిల్లలు కళ్లెం కిరణ్ (11) 5వ తరగతి, కళ్లెం జీవన్ (13) 6వ తరగతి చదువుతున్నారు. వీరితోపాటు కళ్లెం వరుణ్ గురువారం సమీపంలోని మూసీ నదిలో చేపలు పట్టడానికి వెళ్లారు. మూసీ నది ఒడ్డున ఉండి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారి కిరణ్ నీళ్లల్లో పడ్డాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న కిరణ్‌ను రక్షించడానికి జీవన్ నీళ్లలోకి దూకాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో వారు మునిగి పోతుండగా వరుణ్ గమనించి పరిగెత్తుకుంటూ వచ్చి కుటుంబ సభ్యులకు, కాలనీ వాసులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని రక్షించే ప్రయత్నం చేసినటప్పటికీ ఫలితం దక్కలేదు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వెతికారు. కిరణ్ మృతదేహం లభ్యం కాగా.. జీవన్ ఆచూకీ లభించలేదు. దాంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టగా ప్రమాదం జరిగిన కొంత దూరంలో శుక్రవారం జీవన్ మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కోసం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు మృతిచెందడంతో వలిగొండలో విషాధ చాయలు అలుముకున్నాయి.


భూదాన్‌పోచంపల్లి: కాకరపూలు కాల్చుతున్న మహిళలు

## అంబరాన్నంటిన దీపావళి

రామగిరి, నవంబర్ 1 : ఇంటి ముంగిళ్లలో దీపాల కాంతులు. పోటాపోటీగా పటాకుల మోతలు.. ఆకాశంలో మిరిమిట్లు గొలిపే వెలుగులతో దీపావళి పండుగ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటింది. ప్రజలు గురు, శుక్రవారం రెండు రోజులు పండుగ చేశారు. నరక చతుర్ధి సందర్భంగా గురువారం తెల్లవారుజామున నివాళి పట్టారు. ఆ రోజు సాయంత్రంతోపాటు శుక్రవారం కేదారేశ్వర నోములు, లక్ష్మీపూజ చేశారు. శుక్రవారం కూడా అమావాస్య ఉండడంతో అమ్మవారిని కొలిచారు. సాయంత్రం నుంచి రాత్రి వరకూ చిన్నాపెద్ద ఉత్సాహంగా పటకాలు కాల్చారు.

